క్లుప్తంగా

డీజే యజమానుల బైండోవర్

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఐదుగురు డీజే యజమానులను తహసీల్దార్ కమల్‌సింగ్ ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. వినాయక నిమజ్జోత్సవాలకు డీజేలకు అనుమతి లేదని.. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

స్కూల్ బ్యాగులు అందజేత



స్కూల్ బ్యాగులు అందిస్తున్న వీడీసీ సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం వీడీసీ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు అందించారు. పిప్రి గ్రామానికి చెందిన కుంట రాజేంధర్ రూ.ఏడు వేలు విలువైన బ్యాగులను 30 మందికి పంపిణీ చేశారు. హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మేడాజీ మురళీధర్, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, వీడీసీ సభ్యులు గణపతి, శంకర్, భోజారెడ్డి ఉన్నారు.

రుచికర భోజనం అందించాలి



భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ కమల్

కుంటాల: మెనూ పాటిస్తూ విద్యార్థులకు రుచికర భోజనం అందించాలని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

శనీశ్వరాలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

భైంసాటౌన్: పట్టణంలోని శనీశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి శనీశ్వరుడికి తైలాభిషేకం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నవగ్రహాలకు పూజలు చేశారు. వివేకానంద ఆవాసం ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు.


చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: కుభీర్ మండలం పార్డి(బి) గ్రామానికి చెందిన అన్నేవార్ రఘునాథ్‌కు రూ.12,500, లింబాద్రికి రూ.30వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. శనివారం భైంసా మండలం దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధిత కుటుంబీకులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ చౌహాన్, అరుణ్, దత్తురాం, శంకర్, దత్తుగౌడ్, గంగయ్య, మిలింద్, మోహన్, సంజీవ్ తదితరులు ఉన్నారు.

మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించాలి



ప్రతిమలు తయారు చేస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణనాథులనే ప్రతిష్ఠించి పూజించాలని మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నరేందర్‌రావు అన్నారు. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మట్టి గణపతులు తయారు చేశారు. కొన్ని ప్రతిమలను విద్యార్థులకు అందించామని మరికొన్ని తయారు చేసి గ్రామస్తులకు అందజేస్తామని హెచ్‌ఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

నిర్మల్‌టౌన్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్మల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాగమాత ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ అమావాస్య రోజున అన్నదానం చేయడం పితృదేవతలను స్మరించడం వంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నందకిశోర్, జిల్లా అధ్యక్షుడు కోటగిరి గోపి, కార్యదర్శి హరివర్మ, శేఖర్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, బద్రిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెత్తురోడుతున్న నేషనల్ హైవే!

- బెల్‌తరోడా వద్ద తరచూ ప్రమాదాలు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



బెల్‌తరోడాలో జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే చోట కనిపించని హెచ్చరిక బోర్డులు

మనదేశంలో రోగాల బారిన పడి మృతిచెందే వారి కన్నా రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్యే ఎక్కువ. అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, ప్రమాదాలు జరిగే స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం కారణమని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తానూరు: భైంసా–నాందేడ్ 61వ జాతీయ రహదారి నెత్తురోడుతోంది. తానూరు మండలంలోని బెల్‌తరోడా బస్‌స్టాప్ సమీపంలో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జాతీయ రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అతివేగంతో వాహనాలు ద్విచక్ర వాహనదారులు, పాదచారులను ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు.

బస్టాప్ వద్ద స్పీడ్ బ్రేకర్లు కరువు..

స్థానికులు, వాహనదారులు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రహదారి నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు బెల్‌తరోడా సమీపంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. బస్‌స్టాప్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేక వాహనాలు అతివేగంతో ప్రయాణిస్తున్నాయి. బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు, రోడ్డు దాటేవారు ఇబ్బంది పడుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రభుదాస్(ఫైల్)

ఇటీవలి ప్రమాదాలు..

- మహలింగి గ్రామానికి చెందిన బన్సోడే ప్రభుదాస్ బస్‌స్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా భైంసా నుంచి నాందేడ్ వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు.
- బెల్‌తరోడా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని అక్కడికక్కడే మరణించాడు.
- జౌలా(బి) గ్రామానికి చెందిన నాగనాథ్ బస్‌స్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా నాందేడ్ నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి



జాతీయ రహదారిపై బెల్‌తరోడా బస్‌స్టాప్ వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు దాటే ప్రజలను వాహనదారులు వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్తున్నారు. వేగ నియంత్రణపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– రాజు, బెల్‌తరోడా

రోడ్డుపైకి మురుగునీరు



హైవే పక్కన సీసీ డ్రెయినేజీ లేకపోవడంతో అధ్వానంగా మురుగునీరు

- భైంసాలోని హైవే పక్కన కరువైన సీసీ డ్రెయినేజీలు
- ఇబ్బందుల్లో వాహనదారులు, స్థానికులు
- పట్టించుకోని అధికారులు

భైంసాటౌన్: పట్టణ పరిధిలోని భైంసా–నిర్మల్ హైవేపై మురుగునీరు పారుతోంది. హైవే పొడువునా పిప్రికాలనీలో కొన్నిచోట్ల సీసీ డ్రెయినేజీలు నిర్మించకుండా వదిలేశారు. దీంతో కచ్చా డ్రెయినేజీల్లోంచి మురుగునీరు హైవేపైకి చేరుతోంది. మరోవైపు ఇరువైపులా కచ్చా డ్రెయినేజీలతో హైవే రోడ్డు పరిధి కుచించుకుపోయింది. ఫలితంగా వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ద్విచక్రవాహనదారులు, పాదచారులు వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.

భైంసా పట్టణంలో భోకర్ చౌరస్తా నుంచి పార్డి(బి) బైపాస్ కూడలి వరకు 61వ నంబరు జాతీయ రహదారి(హైవే) రెండు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. నిబంధనల ప్రకారం రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రెయినేజీలు నిర్మించాలి. కొన్నిచోట్ల మాత్రమే డ్రెయినేజీలు నిర్మించారు. బస్‌డిపో మొదలు పిప్రి కాలనీ వరకు సీసీ డ్రెయినేజీలు కొన్నిచోట్ల లేకపోవడంతో కచ్చా డ్రెయినేజీలు ఏర్పాటు చేసుకున్నారు. కచ్చా డ్రెయినేజీల్లోంచి తీసిన పూడికను రోడ్డు పక్కనే వేస్తుండటంతో రోడ్డు పరిధి తగ్గి వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. పిప్రికాలనీ మార్గంలో కచ్చా డ్రెయినేజీల్లో నుంచి మురుగు రోడ్డుపై పారుతుండడంతో ఆయా కాలనీవాసులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. హైవే అధికారులు, నిర్వాహకులు స్పందించి సీసీ డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు, వాహనదారులు కోరుతున్నారు.



భైంసాటౌన్: శివాజీనగర్ మార్గంలో రోడ్డుపై చేరిన మురుగునీరు



హైవే పక్కనే ప్రమాదకరంగా మట్టికుప్పలు

ఎడ్ల ప్రతిమల నిమజ్జనం



కుంటాల: నిమజ్జనానికి వెళ్తున్న రైతులు

కుంటాల: పొలాల అమావాస్య నేపథ్యంలో మండలంలోని దౌనెల్లి గ్రామంలో రైతులు ఎడ్ల ప్రతిమలను తమ ఇళ్లల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు. శనివారం తమ ఆచారం ప్రకారం నేతకాని కులస్తులు ఎడ్ల ప్రతిమలను స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు.

మట్టి ఎడ్లకు పూజలు

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామంలో నేతకానిలు పొలాల అమవాస్య ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం నేతకానిలు మట్టితో తయారు చేసిన ఎడ్ల ప్రతిమలకు పూజలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. ఆదివారం బోడిగే కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఓటు చోరీపై కొవ్వొత్తులతో నిరసన



ర్యాలీలో పాల్గొన్న కృష్ణవేణి, కాంగ్రెస్ నేతలు

సోన్: మండలంలోని గంజాల్ గ్రామంలో శనివారం ఓటు చోరీపై కొవ్వొత్తులతో ఇందిరా ఫెలోషిప్ జోనల్ ఇన్‌చార్జి అల్లూరి కృష్ణవేణి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు భారత ఎన్నికల కమిషన్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితాలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని.. భారత రాజ్యాంగం కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందిరా ఫెలోషిప్ పీసీసీ ఇన్‌చార్జి ఎంబడి రాజేశ్వర్, ఇందిరా ఫెలోషిప్ సభ్యులు వాసవి, కొండ రేఖ, లక్ష్మి, సౌమ్య, కాంగ్రెస్ నాయకులు మొయినొద్దీన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, మల్లయ్య, ముత్తన్న, మహేందర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన ముస్కు లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతోంది. ఇటీవల నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం రూ.2 లక్షల విలువైన ఎల్‌వోసీని శనివారం లక్ష్మి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



భోజారెడ్డి ఇంటి వద్ద ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన భోజారెడ్డి, గజ్జవ్వ ఇటీవల మృతి చెందారు. శనివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబీకులను ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్, అర్బత్ కాలనీలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సమస్యలపై ఇటీవల ఖానాపూర్‌లో జరిగిన వినియోగదారుల ఫోరం సమావేశంలో ఫిర్యాదు చేసినట్లు జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.వకీల్ తెలిపారు. అయితే ఇప్పటికీ అధికారులు సమస్య పరిష్కరించకపోవడంతో శనివారం నిజామాబాద్‌లోని కార్యాలయంలో మరోసారి ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈఆర్‌టీ రాజేశ్వర్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


విద్యార్థులు కళాశాలకు హాజరవ్వాలి

తానూరు: విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ సూచించారు. శనివారం కళాశాల విద్యార్థుల హాజరును ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరం ఉండి కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని విద్యార్థులకు సూచించారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్‌లో ప్రభుత్వ పథకాలపై శనివారం కళాజాత నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ సాంస్కృతిక కళాకారుల బృందం సభ్యులు ఇంది రమ్మ ఇళ్లు, రైతుభరోసా, గృహలక్ష్మి తదితర పథకాలతోపాటు సీజనల్ వ్యాధుల కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటలు, మి మి క్రీ ద్వారా వివరించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, కళాకారులు సుదర్శన్, కదారి రఘునాథ్, నాగరాజు, సుధాకర్, స్వామి, లక్ష్మణ్, జితేందర్ ఉన్నారు.

‘రైతులను ఇబ్బంది పెట్టొద్దు’



మాట్లాడుతున్న సయ్యద్ హైదర్

నిర్మల్‌టౌన్: రాజకీయ కారణాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా సరఫరా చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ మండిపడ్డారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతులు ఎరువుల కోసం గంటల తరబడి క్యూ కట్టాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ప్రభుత్వం మేల్కొనకుంటే ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా పోరాడుతామని హెచ్చరించారు. ఇందులో అబ్దుల్ సాదిక్, వినోద్, హైమద్, శ్రీనివాస్ ఉన్నారు.

నానో ఎరువులతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ఏవో గిరిరాజ్

లోకేశ్వరం: పంటలకు నానో డీఏపీ, యూరియా ఎరువులను వినియోగిస్తే నేల సారవంతంగా మారి అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి గిరిరాజ్ అన్నారు. శనివారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నానో యూరియా, డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ నానో యూరియా వినియోగంతో పంటలకు కావాల్సిన నత్రజని అందుతుందన్నారు. యూరియా పనితనం 2 నుంచి 5 రోజులుగా ఉంటే, నానో యూరియా పనితనం ఐదు నుంచి 15 రోజులుగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో సంగీత, రుచిత, రైతులు ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



కడెం: మాట్లాడుతున్న ఎస్సై సాయికిరణ్

కడెం: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ ఆర్.ప్రభాకర్, ఎస్సై పి.సాయికిరణ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. వినాయకుడి మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా నిబంధనలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

కుంటాల: భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనోత్సవాలను జరుపుకోవాలని తహసీల్దార్ కమల్ సింగ్ పేర్కొన్నారు. శనివారం కుంటాల పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో శాంతికమిటీ నిర్వహించారు. ఎస్సై అశోక్ మాట్లాడుతూ వేడుకలకు డీజేలకు అనుమతి లేదన్నారు. నిర్వాహకులకు తన వంతుగా రూ.10వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందిస్తానని ప్రకటించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గజ్జారాం, ఏఎస్సైలు, దేవన్న, జీవన్ రావు, నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ప్రఖండ ప్రముఖ్‌గా ప్రతాప్‌సింగ్



ప్రతాప్‌సింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుభీర్: విశ్వహిందూ పరిషత్ ప్రఖండ(తాలుకా) ప్రముఖ్‌గా కుభీర్‌కు చెందిన ప్రతాప్‌సింగ్, కార్యదర్శిగా శ్రీకర్‌ను నియమించినట్లు జిల్లా కార్యదర్శి తుమ్మల కృష్ణ తెలిపారు. కుభీర్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భజరంగ్‌దళ్ ప్రఖండ అధ్యక్షుడిగా రావుల గణేశ్, కార్యదర్శిగా శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. హనుమంతుడి స్ఫూర్తితో హిందూ ధర్మపరిరక్షణ చేస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా ధర్మజాగరణ ప్రముఖ్ అభిషేక్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పోశెట్టి, కె.శ్రీనివాస్, దత్తాత్రి, ఎస్.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ బస్సులు



మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

కుభీర్: తీర్థయాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని.. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సరియా నాయక్, శ్రీనివాస్ తెలిపారు. కుభీర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆర్టీసీ సేవలపై శనివారం అవగాహన కల్పించారు. వేములవాడ, ధర్మపురి, కొండగట్టు క్షేత్రాల దర్శనాలు ఒకేరోజు చేయిస్తామని తెలిపారు. కుభీర్ నుంచి ఒకరికి రూ.600 చొప్పున టికెట్ చార్జీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 50 మంది ఉంటే బస్సు వారివద్దకే పంపుతామని తెలిపారు. తిరుపతి, అయోధ్యతోపాటు ఏయే పుణ్య క్షేత్రానికైనా కిలోమీటర్ చొప్పున డబ్బులు తీసుకుని బస్సులు నడిపిస్తామని వివరించారు.

‘ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి’

తానూరు: నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫాం పేరిట అధిక వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మన తెలంగాణ విద్యార్థి సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరాం మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో సౌకర్యాలు లేకున్నా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

పాఠశాల ప్రారంభానికి ఆహ్వానం



అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఎంఈవోలు

భైంసాటౌన్: మండలంలోని బాబుల్‌గాం గ్రామానికి నూతనంగా మంజూరైన ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవానికి రావాలని అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్(స్థానిక సంస్థలు), కిశోర్‌కుమార్(రెవెన్యూ)తోపాటు డీఈవో రామారావును భైంసా ఎంఈవో సుభాష్ కోరారు. ఈ మేరకు శనివారం వారిని నిర్మల్‌లోని తమ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. సారంగపూర్, నిర్మల్ రూరల్ ఎంఈవోలు బి.మహేందర్, వెంకటేశ్వర్ ఉన్నారు.

సర్వే పరిశీలన



ఎర్వచింతల్‌లో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఖానాపూర్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలుపై మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్, కోలాంగూడ గ్రామాల్లో చేపట్టిన సర్వేను శనివారం ఎంపీడీవో రత్నాకర్‌రావు పరిశీలించారు. పథకం యాప్‌లో లబ్ధిదారుల ఆధార్, బ్యాంక్‌ఖాతా, ఇతర వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో దేవేందర్, హనుమంత్, మహేశ్, పీర్యా, రాజు, హరీశ్ తదితరులున్నారు.

వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: వర్షాల నేపథ్యంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రత్నాకర్ రావు అన్నారు. శనివారం మండలంలోని దిలావార్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం సందర్శించారు. రోగాల బారిన పడకుండా పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతిగౌడ్, అబ్బుబాయ్, పంచాయతీ, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899